క్లుప్తంగా

చలివేంద్రం ఏర్పాటు



పాదచారులకు మజ్జిగ అందజేస్తున్న యజ్ఞకర్త శర్మయాజీ

వీరఘట్టం: స్థానిక పైడితల్లి అమ్మవారి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎన్ శర్మయాజీ ఆదివారం ప్రారంభించారు. వేసవిలో ఆలయానికి వచ్చే భక్తులు, ఈ మార్గంలో రాకపోకలు సాగించే బాటసారులు, వాహన చోదకుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా పలువురికి మజ్జిగ పంపిణీ చేశారు.

రైతుల సమక్షంలోనే సర్వేరాళ్ల ఏర్పాటు



సర్వేరాళ్ల ఏర్పాటును పరిశీలిస్తున్న డీటీ సన్యాసిరావు

పాలకొండ రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర భూసర్వే కార్యక్రమంలో భాగంగా సర్వే పూర్తయిన గ్రామాల్లో హద్దు రాళ్ల ఏర్పాటును సకాలంలో పూర్తిచేయాలని డిప్యూటీ తహసీల్దార్ పి.సన్యాసిరావు అన్నారు. మండలంలోని లుంబూరు సచివాలయ పరిధిలో చేపడుతున్న సర్వరాళ్ల ఏర్పాటును సర్పంచ్ ఉపేంద్రకుమార్‌తో కలిసి ఆదివారం పరిశీలించారు. ఎలాంటి వివాదాలకు తావులేకుండా రైతుల సమక్షంలోనే హద్దురాళ్ల ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు.

తాగునీటి బోరు మరమ్మతులు



అత్తికొత్తూరు వద్ద బోరు బాగుచేయిస్తున్న ఏఈఈ సందీప్

భామిని: మండలంలోని అన్ని గ్రామాల్లో పాడైన తాగునీటి బోర్లను క్రాస్ ప్రోగ్రాం ద్వారా మరమ్మతులు చేయిస్తున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ అమరాన సందీప్ అన్నారు. వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా ముందుస్తు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. తాలాడ, అత్తికొత్తూరు, అత్తికొత్తూరు కాలనీ, తదితర గ్రామాల్లో పాడైన చేతి పంపు బోర్లను ఆదివారం బాగుచేయించారు. ప్రజలు తాగునీటి బోర్లను జాగ్రత్తగా వాడుకోవాలని, ఎక్కడైనా బోర్లు పాడైతే వెంటనే తమకు సమాచారం అందించాలని కోరారు.

రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు

పాలకొండ రూరల్: మండలంలోని వి.పి.రాజుపేట మీదుగా భాసూరు గ్రామానికి వెళ్లే రహదారిలో జంపరకోట గెడ్డ కోతకు గురైయ్యింది. దీంతో రాకపోకలకు కొంత ఇబ్బందులు ఏర్పడటంతో గ్రామస్తులు తాత్కాలికంగా గండిని పూడ్చేందుకు సిద్ధమయ్యారు. ఆదివారం యంత్ర సాయంతో మట్టిని పోసి గండిపూడ్చారు. అయితే అధికారులు స్పందించి శాశ్వత ప్రాతిపదికన రోడ్డు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

క్రికెట్ టోర్నీ విజేత ఆర్డీ బాయిస్



టోర్నీ విజేత ఆర్డీ బాయిస్ జట్టు సభ్యులు

పాలకొండ రూరల్: జగన్నథస్వామి ఆలయ సమీపంలో ఉన్న క్రీడా ప్రాంగణంలో గత వారం రోజులుగా లొడగల వెంకటరమణ జ్ఞాపకార్థం నిర్వహించిన క్రికెట్ టోర్నీ ఆదివారంతో ముగిసింది. నియోజకవర్గం నుంచి 30 జట్లు ఈ పోటీల్లో తలపడ్డాయి. పాలకొండ యాలం కూడలికి చెందిన ఆర్డీ బాయిస్ ప్రథమ స్థానంలో నిలిచారు. విజేతలకు టోర్నీ నిర్వాహకుడు ఎల్.శేఖర్ రూ.10వేలు నగదు, షీల్డ్‌ను అందించారు. అలాగే జి.సంతోష్‌కుమార్ రూ.2వేలు అదనంగా అందించారు. విజేత జట్టు సభ్యులు ఈ మొత్తాన్ని ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన సాయి అనే క్రీడాకారుడిని అందించి సేవాభావాన్ని చాటుకున్నారు. ద్వితీయ స్థానంలో నిలిచిన గొల్లవీధికి చెందిన శ్రీకృష్ణ యూత్‌కు రూ.7వేలు, జ్ఞాపికను నిర్వాహక ప్రతినిధులు ఎల్.దుర్గారావు, శంకరరావు, రాంబాబు తదితరులు అందించారు.

కూరగాయల సాగు.. లాభాలు బాగు

- యాజమాన్య పద్ధతులు పాటిస్తే ఆశించిన దిగుబడులు
- అంతర పంటలుగా కూడా సాగు చేసుకునే అవకాశం



క్యాబేజీ పంట



బీరపాదు



దొండపాదు



బెండసాగు

గరుగుబిల్లి: కూరగాయ పంటలు సాగు చేసే రైతులు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు పొందవచ్చు. విత్తనాల ఎంపిక, సాగు విధానం, తెగుళ్ల నివారణపై అవగాహన పెంచుకోవడం ద్వారా దిగుబడులు పెరిగి లాభాలు పొందవచ్చన్నారు. కూరగాయ పంటల సాగులో పాటించాల్సిన మెళకువలను మండల వ్యవసాయాధికారి ఆర్.విజయభారతి వివరించారు

పంటల సాగులో జాగ్రత్తలు

- నారు మొక్కలను నీడలో పెంచాలి. విత్తనాలు వేసుకునే ముందు తప్పనిసరిగా విత్తనశుద్ధి చేయాలి. నారుమడులపై నైలాన్ వల(నెట్)ను ఏర్పాటు చేసుకోవడం ఉత్తమం.
- మొక్కలకు నీడనిచ్చే విధంగా ఆముదం, మొక్కజొన్న వంటి పంటలను ఉత్తర, దక్షిణ దిశలో నాటుకుంటే ఫలితం ఉంటుంది.
- వేసవిలోనాటిన మామిడి, జామ, కొబ్బరిలాంటి పండ్లతోటలలో మొదటి 3-4 సంవత్సరాలు అంతరపంటలుగా బెండ, సొర, బీర, గుమ్మడి, దోస, చిక్కుడు, గోరుచిక్కుడు వంటి కూరగాయల పంటలను వేసుకొని అదనపు ఆదాయం పొందవచ్చు.
- నేలలోని తేమను సంరక్షించే చర్యలు చేపట్టాలి. వీలైనంత ఎక్కువ మోతాదులో సేంద్రియ ఎరువులను, జీవన ఎరువులను వాడాలి.
- ఉన్నకొద్దిపాటి నీటిని బిందు(డ్రిప్) లేదా, తుంపర్ల(స్ప్రింకర్ల) పద్ధతిలో అందివ్వాలి. కొద్దినీటితో ఎక్కువ విస్తీర్ణంలో కూరగాయలను పండించుకొనే విధానంపై అవగాహన కలిగివుండాలి.
- టమాటా, పుచ్చపంటలో నీటియాజమాన్యం సరిగా లేకపోతే కాయపగుళ్లు ఏర్పడతాయి. కాయపగుళ్ల నివారణకు 3 గ్రాముల బోరాక్స్‌ను లీటర్ నీటిలో కలిపి పిచికారిచేయాలి.
- తీగజాతి కూరగాయల్లో అధిక ఉష్ణోగ్రతకు మగపూలు ఎక్కువగా వస్తాయి. దీని నివారణకు పూతదశలో సిఫార్సు మేరకు మందులు వాడాలి.
- పొటాష్‌ను సరైన మోతాదులో వాడితే నీటిఎద్దడిని, చీడపీడలను తట్టుకొనే గుణం మొక్కలలో పెరుగుతుంది. కిలో యూరియాకు అరకిలో పొటాష్‌ను తప్పనిసరిగి వాడాలి.
- యూరియా ఎండ వేడిమికి త్వరగా ఆవిరికాకుండా మొక్కకు ఎక్కువ రోజులు అందుబాటులో ఉండేలా 9 కిలోల యూరియాకు ఒక కిలో వేప పిండిని కలిపి వేసుకోవాలి.
- పూత, పిందె రాలకుండా పిందె బాగా పట్టుపట్టడానికి టమాటా, వంగ పంటలకు 1 ఎం.ఎల్ ప్లానోపిప్స్ మందును 5 లీటర్ల నీటిలో కలిపి పూతదశలో వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి.

వేసవిలో సాగుకు అనువైన రకాలు

- టమాటాలో సాధారణ రకాలు: మారతం, ఆర్కవికాస్
- టమాటాలో సంకర రకాలు: రష్మి, నవిన్, అవినాష్-2, లక్ష్మి
- బెండలో సాధారణ రకాలు: అర్క, అనామిక
- బెండలో సంకర రకాలు: వర్ష, మహికో-10, ప్రియ, సుప్రియ
- బీరలో సంకర రకాలు: సంజీవిని, మహిమ, సురేఖ, ఎస్ఎస్401
- గోరుచిక్కుడులో సంకర రకాలు: గౌరి, పూసా నవ, బహార్
- కాకరలో సంకర రకాలు: ఎంబీటీహెచ్101, 102, మహికో10,13.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి
- బిత్రపాడులో 'గడపగడపకు మన ప్రభుత్వం'



గడపగడపకూ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

జియ్యమ్మవలస: నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలు అమలు చేస్తున్నారని, అర్హత ఉన్న ప్రతీ కుటుంబానికి పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండలంలోని బిత్రపాడు గ్రామంలో ఆదివారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు స్థానిక మహిళలు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. స్థానిక నాయకులు, అధికారులు, వలంటీర్లతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. నాలుగేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించే పత్రాలను అందజేశారు. పార్టీలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చినట్లు చెప్పారు. మంచి చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలంతా మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ గుంట్రెడ్డి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మూడడ్ల శశికళ, మండల కన్వీనర్ మూడడ్ల గౌరీశంకరరావు, డీసీసీబీ డైరెక్టర్ లోలుగు నారాయణరావు, పార్టీ నాయకులు అల్లు ఈశ్వరరావు, బలగ వెంకటరమణ, మరడాన కిశోర్, అల్లు రాజేశ్వరరావు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చెరుకు సాగు తగ్గుముఖం



ఖడ్గవలస వద్ద సాగుచేస్తున్న చెరుకుపంట

గరుగుబిల్లి: మండలంలో చెరుకుసాగు విస్తీర్ణం ఏటా తగ్గుముఖం పడుతోంది. గిట్టుబాటు ధర లేకపోవడం, సకాలంలో డబ్బులు చెల్లింపులు జరగకపోవడంతో చెరుకు సాగు చేసేందుకు రైతులు ఆశక్తి చూపడంలేదు. మండలంలోని సంతోషపురం, సుంకి, మరుపెంట, రావివలస, ఖడ్గవలస, కారివలస, లఖనాపురం తదితర గ్రామాల్లో వ్యవసాయ బోర్లు ఉన్నచోట రైతులు చెరుకు సాగుచేసేవారు. గోగు, వేరుశనగ, అపరాల పంటల సాగు కంటే చెరుకు సాగు లాభదాయకంగా ఉండేది. అయితే గత రెండేళ్లుగా సీతానగరం మండలంలోని ఎన్‌సీఎస్ సుగర్ ఫ్యాక్టరీ నిర్వాహణలో లేకపోవడంతో రైతులు చెరుకు సాగుపై ఆసక్తి చూపడం లేదు. అక్కడక్కడా సాగు చేసిన పంటను సంకిలి సుగర్ ఫ్యాక్టరీకి తరలిస్తున్నారు. అయితే గిట్టుబాటు ధర లేకపోవడం, రవాణా చార్జీలు పెరిగిపోవడంతో రైతులకు నష్టాలే మిగులుతున్నాయి. ఇదేపరిస్థితే కొనసాగితే భవిష్యత్‌లో ఈ ప్రాంతంలో చెరుకుపంట కనమరుగయ్యే అవకాశం ఉందని రైతులు అంటున్నారు.

క్లీన్ అండ్ గ్రీన్‌లో జోగింపేట ఉత్తమం

సీతానగరం: మండలంలోని జోగింపేట పంచాయతీని క్లీన్‌అండ్ గ్రీన్‌లో ఉత్తమ గ్రామ పంచాయతీగా రాష్ట్ర ప్రభుత్వం ఎంపిచేసింది. ఈ మేరకు సోమవారం అమరావతిలో జరుగనున్న పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అవార్డును బహూకరించనుందని ఈఓపీఆర్డీ కె. కుమారవర్మ తెలియజేవారు. ఈ నేపథ్యంలో సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, పాలకవర్గ సభ్యులను పలువురు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

మక్కువ: రెండు బైక్లు ఢీకొనడంతో ఐదుగురు గాయపడిన సంఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని మూలవలస గ్రామానికి చెందిన ఎం. శ్రీనివాస్, మర్రి ప్రసాద్ ద్విచక్ర వాహనంపై మక్కువ నుంచి మూలవలస వెళ్తున్నారు. ఇదే సమంయలో సాలూరు మండలం పట్టుచెన్నూరు గ్రామానికి చెందిన ఎస్. శంకర్, తాడంగి బెహన్, తాడంగి సుఖిల ద్విచక్ర వాహనంపై మార్కొండపుట్టి నుంచి మక్కువ వైపు వస్తున్నారు. సరిగ్గా సరేయవలస జంక్షన్ సమీపంలోకి వచ్చేసరికి ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొనడంతో ఐదుగురు గాయపడ్డారు. వెంటనే క్షతగాత్రులను మక్కువ పీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం ఏరియా ఆస్పత్రికి రిఫర్ చేశారు.

సస్పెన్షన్ ఉపసంహరించుకోవాలి



గాంధీజీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న యూఎస్‌పీఎస్ నాయకులు

గుమ్మలక్ష్మీపురం: జిల్లాలో విద్యాశాఖ అధికారులపై విధించిన సస్పెన్షన్‌ను ఉపసంహరించుకోవాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ మేరకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఉన్న మహాత్మాగాంధీ విగ్రహానికి ఆదివారం ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి నాయకుడు ఆదివారం వినతిపత్రం అందజేశారు. విద్యాశాఖ అధికారు సస్పెన్షన్ అన్యాయమన్నారు.

ఇంటింటా ఆనందం



భామిని: పెద్దదిమిలిలో సర్పంచ్ శ్రీను ఆధ్వర్యంలో ప్రభుత్వానికి మద్దతు తెలుపుతున్న మహిళలు

సీతంపేట, భామిని: 'జగనన్నే మా భవిష్యత్తు- మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం ఉత్సాహంగా కొనసాగుతోంది. సీతంపేట మండలం గజిలి, చాకలిగూడ, టిటుకుపాయి, కుశిమి తదితర గ్రామాల్లో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. స్థానికులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోతో ఉన్న స్టిక్కర్లను ఇంటి గోడలపై అతికించి ప్రభుత్వానికి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎస్.లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. భామిని మండలం పెద్దదిమిలిలో సర్పంచ్ తొగరాన శ్రీను, నులకజోడులో సర్పంచ్ కొత్తూరు ప్రసాద్, ఉపసర్పంచ్ కొన్న తిరుమల ఆధ్వర్యంలో సంక్షేమ పథకాలపై పెద్ద ఎత్తున ప్రచారం చేశారు.



సీతంపేట: టిటుకుపాయిలో 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమం నిర్వహిస్తున్న నాయకులు



భామిని: నులకజోడులో సంక్షేమ పథకాలపై ఇంటింటా ప్రచారం చేస్తున్న గృహసారథులు, వలంటీర్లు

అమ్మవారి పండగకు పటిష్ట బందోబస్తు



ఉత్సవ ఏర్పాట్ల వివరాలు తెలుసుకుంటున్న డీఎస్పీ కృష్ణారావు, సీఐ మురళీధర్

వీరఘట్టం: మేజరు పంచాయతీ వీరఘట్టం గ్రామదేవత పైడితల్లి అమ్మవారి పండగలు ఈ నెల 30 నుంచి మే నెల 10వ తేదీ వరకు జరగనున్నాయి. ఏడేళ్ల తర్వాత నిర్వహిస్తున్న ఈ పండగను ఘనంగా చేసేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేస్తోంది. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు. ఈ మేరకు పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు, సీఐ మురళీధర్, ఎస్సై కిషోర్‌వర్మ ఆదివారం అమ్మవారిని దర్శించుకుని, ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ కమిటీ సభ్యులతో సమావేశమై ఉత్సవ ఏర్పాట్లకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. మే నెల 9న సిరిమానోత్సవం జరగనుందని, ఈ ఉత్సవానికి లక్షకు పైగా భక్తులు వచ్చే అవకాశం ఉందని యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎన్ శర్మయాజీ, కమిటీ సభ్యులు తెలిపారు. ఆ సమయాల్లో కోవెల వద్ద భక్తులకు ఇబ్బందులు కలగకుండా, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని కోరారు. సిరిమానోత్సవం రోజు ట్రాఫిక్‌ను మళ్లించి వాహనాలు రెల్లివీధి మీదుగా బార్నాలవీధి గుండా కొత్తబస్టాండ్‌కు చేరుకొనే విధంగా చర్యలు చేపడతామని డీఎస్పీ తెలిపారు.

ఎస్సై ఔదార్యం



ఆర్థికసాయం చేస్తున్న ఎస్ఐ నీలకంఠరావు

సీతంపేట: స్థానిక ఎస్సై నీలకంఠరావు సేవా భావాన్ని చాటుకున్నారు. కొత్తూరు మండలం శోభనాపురం గ్రామానికి చెందిన గిరిజన యువకుడు కోలక ఆఫీస్ గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతుండడంతో వైద్యం కోసం తన వంతు సాయంగా రూ.10వేలు ఆదివారం అందజేశారు. గుండె ఆపరేషన్‌కు భారీగా ఖర్చవుతుందని వైద్యులు చెప్పడంతో ఏం చేయాలో తెలియక దిక్కుతోచని స్థితిలో ఉన్న ఆ కుటుంబానికి తనవంతు సాయం అందించి అండగా నిలిచారు. దాతలు ముందుకొచ్చి ఆ కుటుంబానికి సాయం అందించాలని గిరిజన సంఘం నాయకులు బి.ఉమామహేశ్వరరావు, తదితరులు కోరారు.

గిరిజన గ్రామాల్లో ఉచిత వైద్యశిబిరాలు భేష్



నిరుపేదలకు వంటపాత్రలు, వ్యక్తిగత పరిశుభ్రత కిట్లు అందజేస్తున్న రెడ్‌క్రాస్ సంస్థ స్టేట్ వైస్ చైర్మన్, డీఎంహెచ్ఓ, తదితరులు

- డీఎంహెచ్ఓ డాక్టర్ బి.జగన్నాథం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని మారుమూల గ్రామమైన తాడికొండలో రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఎగువతాడికొండ, చాపరాయి జంగిడిభద్ర, తాడికొండ, అడ్డంగి జంగిడిభద్ర, ఒడ్రుబంగి, శిఖరపాయి, కప్పకల్లు తదితర గ్రామాల నుంచి వచ్చిన సుమారు 300 మందికి నిపుణులైన వైద్యులు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. డీఎంహెచ్ఓ డాక్టర్ బి.జగన్నాథం వైద్యశిబిరాన్ని పర్యవేక్షించారు. గిరిజన గ్రామాల్లో ఇటువంటి శిబిరాలు ఏర్పాటు చేస్తున్న రెడ్‌క్రాస్ సంస్థను అభినందించారు. అనంతరం రెడ్‌క్రాస్ సంస్థ సమకూర్చిన వంటపాత్రలు, వ్యక్తిగత పరిశుభ్రత కిట్లను స్థంస్థ వైస్ చైర్మన్ జగన్మోహనరావు, డీఎంహెచ్ఓ బి.జగన్నాథం సుమారు 150 మంది నిరుపేదలకు అందజేశారు. కార్యక్రమంలో పార్వతీపురం మన్యం జిల్లా చైర్మన్ మంచిపల్లి శ్రీరాములు, కార్యదర్శి బీఎన్‌బీ రావు, సంస్థ ప్రతినిధులు పైడా కొండలరావు, తార్ది రమేష్, జెడ్పీటీసీ మండంగి రాధిక, సర్పంచ్ మండంగి జగ్గారావు, మాజీ సర్పంచ్ అడ్డాకుల గంగరాజు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ అడ్డాకుల చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సేవలు విస్తృతం: సంస్థ రాష్ట్ర వైస్ చైర్మన్ జగన్మోహనరావు

రెడ్‌క్రాస్ సంస్థ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా విస్తృత సేవలు అందిస్తున్నామని ఆ సంస్థ స్టేట్ వైస్ చైర్మన్ జగన్మోహనరావు అన్నారు. స్థానిక విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో రెడ్‌క్రాస్ సంస్థ సేవలు నిర్విరామంగా కొనసాగుతున్నాయన్నారు. 26 బ్లడ్ బ్యాంకులు ఉన్నాయని, వాటి ద్వారా 14.50 లక్షల యూనిట్ల రక్తాన్ని సేకరించి అవసరమైన వారికి అందజేశామన్నారు. కోవిడ్ సమయంలో సంస్థ ద్వారా 4.12 లక్షల మందికి భోజన సదుపాయం కల్పించామని, 386 కరోనా మృతదేహాలను ఖననం చేశామన్నారు. శ్రీకాకుళం జిల్లాలో రెడ్‌క్రాస్ ద్వారా శాంత కర్షక అనురాగ నిలయంను ఏర్పాటు చేసి 40 మంది అనాథలకు, 16 మంది వృద్ధులకు ఆశ్రయం కల్పించినట్లు చెప్పారు.

అలాగే ప్రతిరోజు సుమారు 350 మందికి భోజనాన్ని అందిస్తున్నామన్నారు. సంస్థ ద్వారా యువతకు ప్రథమ చికిత్స విధానంపై ఉచితంగా శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు.

సర్వేయర్ల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న జిల్లా సర్వేయర్ల సంఘం నాయకులు

పాలకొండ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర భూ సర్వేలో సర్వే సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సర్వేయర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు స్వామినాయుడు కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో జిల్లా సర్వేయర్ల సంఘం సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ స్థాయిలో సర్వే సిబ్బంది పడుతున్న ఇబ్బందులను విలేజ్ సర్వేయర్లు వివరించారు. ఉదయం 7 గంటల నుంచి రాత్రి వరకు విధులు నిర్వహించాల్సి వస్తోందని, సెలవు రోజుల్లో సైతం సర్వే చేస్తున్నామని, డెప్యూటేషన్‌లు వేస్తున్న సమయంలో రవాణా చార్జీలు చెల్లించడం లేదని వాపోయారు. క్షేత్ర స్థాయిలో ఎదురవుతున్న పలు సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై జిల్లా అధ్యక్షుడు స్వామినాయుడు స్పందిస్తూ.. ఆయా సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషిచేస్తామన్నారు. సిబ్బందిపై ఒత్తిడి లేకుండా సర్వే చేపట్టేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని అధికారులను కోరారు. సమావేశంలో యూనియన్ రాష్ట్ర సభ్యులు నాగేశ్వరరావు, పాలకొండ తాలూక ప్రెసిడెంట్ కె.శ్రీనివాసరావు, డివిజన్ అధ్యక్షుడు పి.వెంకటరావు, సంతోష్‌కుమార్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నవోదయ మోడల్ టెస్ట్‌కు విశేష స్పందన



జియ్యమ్మవలస: ప్రథమస్థానంలో నిలిచిన విద్యార్థికి బహుమతి అందజేస్తున్న సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్

జియ్యమ్మవలస:

మండలంలోని పెదమేరంగి కూడలిలో ఉన్న తిరుమలసాయి ఉన్నత పాఠశాలలో ఆదివారం నవోదయ మోడల్ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు 506 మంది విద్యార్థులు హాజరయ్యారు. ప్రథమస్థానంలో భాగ్యలక్ష్మి, రెండో స్థానంలో లోలుగు లిఖిత, మూడో స్థానంలో గుంట్రెడ్డి చాణిక్య నిలిచారు. మొదటి పది స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్ చేతులమీదుగా బహుమతులు అందజేశారు.

- భామిని మండంల సింగిడి రాజుబాబు పబ్లిక్ స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన నవోదయ మోడల్ టెస్ట్‌కు భామిని, కొత్తూరు, సీతంపేట మండలాల నుంచి 50 మంది విద్యార్థులు హాజరయ్యారు.

ప్రశాంతంగా సీఓఈ, ఎస్ఓఈ ప్రవేశ పరీక్ష

సీతంపేట: స్థానిక గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో ఆదివారం కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్, స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లలో ప్రవేశాలకు రాతపరీక్ష నిర్వహించారు. సీఓఈ పరీక్షకు 265 మంది దరఖాస్తు చేయగా..226 మంది హాజరుకాగా, 39 మంది గైర్హాజరయ్యారు. ఎస్ఓఈ పరీక్షకు 119 మంది దరఖాస్తు చేసుకోగా.. 113 మంది హాజరయ్యారు. ఆరుగురు గైర్హాజరైనట్టు ప్రిన్సిపాల్ కె.సురేష్ తెలిపారు.



సీతంపేట: పరీక్ష నిర్వహణను పర్యవేక్షిస్తున్న ప్రిన్సిపాల్ కె.సురేష్